# ఫ్యునరల్ పార్లర్

ఎయిర్‌పోర్టులో ముంబయికి వెళ్ళే విమానం కోసం సతీసమేతంగా ఎదురుచూస్తున్నాడు రామానుజం. మనసులో ఏదో తమకం. ప్రపంచాన్ని జయించినంత ఉత్సాహం. భార్య ఏదో పుస్తకం చదువుకుంటోంది. సెక్యూరిటీ చెక్, ఇంకా ఇతర పనులు పూర్తి చేశాడు. నిమిషాలు భారంగా గడుస్తున్నాయి. ఇంతలో ఫోన్ మోగింది.

"జాగ్రత్తగారండి. కంగారుపడకండి. ట్రైన్‌లో ఉన్నట్టే ఉంటుంది. మీకు కావలసిన వెజిటేరియన్ పుడ్ ఇస్తారు. నేను ఎయిర్‌పోర్టుకు వస్తాను"కొడుకు శంకరం మాటలతో "సర్లేరా.... చాలాసార్లు చెప్పావ్. మేమేమన్నా చిన్న పిల్లలమా... ఏం కంగారుపడకు" అంటూ ఫోన్ పెట్టేశాడు.

రామానుజంలో ఆలోచనలు ముసురుకున్నాయి.

తను కొడుకు గురించి బెంగపడేవాడు. వాడి చదువు అంతంత మాత్రంగా ఉండేది. తాతగారి అడుగుజాడల్లో నడుస్తాడేమోనని భయంగా ఉండేది.

దానికి తగ్గట్టు వాడు, పదేళ్ళ వయస్సప్పటినుంచీ పంచెకట్టుకుని భుజాన తువ్వాలు వేసుకుని చిన్నరాగి చెంబుతో తాతగారి వెంట నడిచేవాడు. ఆ దృశ్యం తనకు అదోలా అనిపించేది. తను ఆ వృత్తిలోకి ప్రవేశించకూడదనుకునే కష్టపడి చదువుకుని భాషాప్రవీణ పూర్తిచేశాడు. ఆ తర్వాత తెలుగు ఎమ్.ఎ. స్కూల్లో తెలుగు పండితుడిగా పనిచేసి కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. ఇప్పటికి ఇరవై ఏళ్ళ సర్వీసు పూర్తయింది. ఇంకో సంవత్సరానికి తను కాలేజీలో తెలుగు హెడ్ అవ్వబోతున్నాడు.

తను అంచెలంచెలుగా పైకి వెళుతుంటే కొడుకు పరిస్థితి దిగజారిపోయింది. ఇంటర్ ఫెయిలయ్యాడు. వాడి ముందున్న కూతురు డిగ్రీ పూర్తి

చేసింది. కూతురు గురించి బెంగలేదు. పెళ్ళిచేసి పంపెయ్యొచ్చు. కొడుకు భవిష్యత్తు ఏమిటా అని మధనపడేవాడు.

ఎవరికి ఏ కష్టం వచ్చినా తాతా మనవళ్ళు వాలిపోయేవారు "నాన్నా, నువ్ వాడ్ని చెడగొడుతున్నావ్?" అనేశాడు ఒకరోజు. "పాపం వాడినెందుకురా చదువుకోమని సతాయిస్తావు. నాతో తిప్పు. మంచి యోగ్యుడయినవాడిగా తయారుచేస్తాను" అనేవాడు.

"ఏమిటీ... నీలా తద్దినపుబ్రాహ్మడిగానా.... ఎంత కాలం అలా కర్మ కాండలు చేస్తావ్.. అగ్రహారంలో అందరూ శుభకార్యాలు చేసి బోలెడు డబ్బులు సంపాదిస్తుంటే, నువ్ మాత్రం ఈ అపరకర్మల వెంటపడ్డావ్. ఇలా పదకొండు రోజుల దినకర్మలు చేసే నిన్ను పెళ్ళిళ్ళకు ఎవరు పిలుస్తారు..." అన్నాడొకసారి కోపంగా.

"ఓరేయ్, అందరూ శుభకార్యాలే చేయిస్తే మరి ఈ దినకర్మలు చేసే వారుండొద్దూ" అనేవాడు నాన్న నవ్వుతూ నాన్న తెచ్చే సంభావనలు, పుచ్చు కునే దానాలు అంటే తనకి అసహ్యంగా ఉండేది. "వాటిని ఇంట్లోకి తీసుకు రాకు. ఎవరికో ఇచ్చుకో" అనేవాడు. తమ ఎన్ని మాటలన్నా నవ్వుతూ తల ఊపేవాడు.

"ఒరేయ్, ఈ తద్దినపు బ్రాహ్మణుడే నిన్ను ఇంత వాడిని చేశాడు. ఇప్పుడు ఏరు దాటినతర్వాత తెప్ప తగలేసిన చందంగా నా వృత్తిని ఎగతాళి చేస్తావా" అని తండ్రి ఏనాడూ అనేవాడు కాదు. అందులో వాస్తవం ఉన్నా మొత్తానికి కొడుకు డిగ్రీ అయిందనిపించాడు. ఆ తర్వాత 'ఎమ్‌బిఎ చేస్తాను' అన్నాడొక రోజు.

"నీకెవడిస్తాడురా సీటు. డిగ్రీలో మార్కులు అంతంత మాత్రం. ఎమ్‌బిఎ సీటు రావాలంటే అధమపక్షం లక్షరూపాయలైనా డొనేషన్ కట్టాలి. ఆ డబ్బులుంటే అక్క పెళ్ళికి ఉపయోగపడతాయి" అని తను అనగానే-

"సరేలే... నీ ఇష్టం" అంటూ వెళ్ళిపోయేడు. ఏదో స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగంలో చేరేడు. చేసే పని ఎక్కువ. జీతం తక్కువ. పాడేరు, చింతపల్లి ఏరియాలో గిరిజన వికాసకేంద్రాల్లో శిక్షణా తరగతులు నిర్వహించేవాడు. తన ఖర్చులు సరిపోగా ఐదారు వేలు నెలయ్యేసరికి తనకిచ్చేవాడు.

తన స్నేహితుల కొడుకులు ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా వేలకు వేలు సంపాదిస్తుంటే నా కొడుకు ఎందుకూ పనికిరాకుండా ఇలా ఏజెన్సీ ఏరియాలో పడ్డాడేమిటి అని తను బాధపడని రోజు లేదు.

అలా పాడేరులో రెండేళ్ళు పనిచేసి "నాన్నా, నాకు మంచి అవకాశం వచ్చింది. దక్షిణాఫ్రికాలో మంచి జీతంతో" అన్నాడొకరోజు. "అంతదూరమా... పైగా ఆఫ్రికా" అన్నాడు తను అనుమానంగా "నా కిష్టమైన పని... వెళతాను..." అన్నాడు కొడుకు శంకరం.

"పోనీలే వెళ్ళనీ... అందరూ అమెరికా వెళుతుంటే నా కొడుకు ఆఫ్రికా వెళుతున్నాడని ఆనందపడతాను"అని ఒప్పుకున్నాను. "వాడు వెళ్ళి మూడేళ్ళయింది. నెలకి పాతికవేలు తక్కువకాకుండా పంపుతాడు. కూతురి పెళ్ళికి వాడు పంపిన డబ్బు బాగా ఉపయోగపడింది. ఇప్పుడు వాడికి ఏదో అవార్డు వచ్చింది. తను పనిచేసే సంస్థవారు సన్మానిస్తున్నారని తమ దంపతుల్ని ఇద్దరినీ తను పనిచేసే జోహాన్స్‌బర్గ్‌కు పిలిచాడు. తనే ఫ్లైటు టిక్కెట్లు పంపాడు. కొడుకు ప్రయోజకుడయ్యాడు.

మనవడి ఉన్నతి చూడకుండానే తన తండ్రి స్వర్గస్తు డయ్యాడు. 'ఈ సమయంలో ఆయన ఉంటే ఎంత బావుండునో' అనుకున్నాడు.

ఇంతలో ఒకాయన "నమస్కారం అండీ. ఫ్లైటు ఎక్కుతున్నట్టున్నారు. ఎక్కడికి" అన్నాడు. తెలిసిన ముఖం. గుర్తులేదు.

"మా అబ్బాయి దక్షిణాఫ్రికాలోని జోహాన్స్‌బర్గ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ముంబయి వెళ్ళి అక్కడినుంచి వేరే ఫ్లైటు" అన్నాడు.

"నేను ముంబయికే, మా మనవడి బారసాల, అన్నట్టు మీ నాన్నగారు మాకు ఆస్థాన పురోహితులు. కర్మకాండాలు చాలా నిష్ఠగా జరిపేవారు. పదేళ్ళు మా ఇంట జరిగే ఆ కార్యాలకు ఆయననే పిలిచేవాళ్ళం. మంత్రం పఠిస్తే పక్క ఊరుకు వినిపించేది. అంత ధారణ శక్తి ఎవరికుంది. మహాను భావుడు" అంటూ రెండు చేతులూ జోడించాడు.

ఆయన మాటకు రామానుజం చుట్టూ చూశాడు. ఎవరైనా వింటున్నా రేమోనని. తనని కలిసిన ఎవరైనా అలా తండ్రిని పొగుడుతూ వుంటే తనకి ఆ పొగడ్త ఎప్పుడూ సంతోషం కలిగించడు. ఎందుకో సిగ్గుగా అనిపిస్తుంది.... తన వృత్తిధర్మాన్ని చక్కగా నిర్వహించి జనాల్లో ఇంకా బతికివున్న తన తండ్రిని చూసి తను గర్వపడాలిగానీ ఎందుకు ఇలా తయారయ్యాడు?

రామానుజం ఆలోచనలో ఉండగానే "ఏమండోయ్ ఎనౌన్స్‌మెంట్ విన్నారా? ముంబయి ఫ్లైటు ల్యాండ్ అవుతోంది. ఎంతసేపు అలా దీర్ఘా లోచనలో ఉంటారు? లేవండి...." అంది భార్య. చేతిలోని బ్యాగ్. భుజం మీదకు మార్చుకుని ముందుకు నడిచాడు.

అదే మొదటిసారి ఫ్లైటు ఎక్కడం. ఇద్దరికీ కంగారుగా అనిపించింది. గంటలో ముంబయి చేరుకున్నారు. ఆ తర్వాత గంటకు వేరే ఫ్లైట్ ఎక్కారు. పదిగంటల ప్రయాణం తర్వాత వారి గమ్యస్థానమైన జోహెన్స్‌బర్గ్ చేరు కున్నారు. కారులో కొడుకు ఎయిర్‌పోర్టుకు వచ్చాడు.

కొడుకు, తను కారుకొనే స్థాయికి ఎదిగినందుకు గర్వపడ్డాడు. సామాను వచ్చాక ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరారు. రోడ్లు మెత్తగా, మృదువుగా ఉన్నాయి. ట్రాఫిక్ చాలా క్రమబద్ధంగా వుంది. కారు డ్రైవ్ చేస్తున్న కొడుకు జోహెన్స్‌బర్గ్ గురించి మొదలుపెట్టాడు.

"జోహెన్స్‌బర్గ్ దక్షిణాఫ్రికాలోని అతిపెద్ద నగరం. గాంధీగారు. మన దేశంలో స్వాతంత్ర్యోద్యమం ప్రారంభించటానికి ముందే ఉద్యమం తొలి

అడుగులు దక్షిణాఫ్రికాలో వేశారు. ప్రపంచంలోని 40 మెట్రోపాలిటన్ నగరాలలో ఇది ఒకటి. ఇక్కడ బంగారం, వజ్రాల వ్యాపారం ఎక్కువ. అలాగే చెట్లూ ఎక్కువే.

ప్రపంచంలో మనుషులతో తయారుచేయబడిన అత్యధిక అటవీ ప్రాంతం ఇక్కడే వుంది. దాదాపు కోటికి పైగా చెట్లున్నాయి. ఈ నగరంలో నల్లాజాతీయులు 73 శాతం ఉంటే, శ్వేతజాతీయులు 16 శాతం'' కొడుకు చెబు తున్నదేదీ రామానుజానికి తలకెక్కడం లేదు.

ఆనందం, ఆశ్చర్యం కలగలిసిన భావనతో మనసు పరవళ్ళు తొక్కుతోంది. అతని దృష్టి అంతా రోడ్డుపక్కనున్న భవనాలు, హొటళ్ళపైనే వుంది. ఇంతలో అతనికి ఒక బోర్డు కనిపించింది. ఒక్కసారి ఒంట్లో ఏదో గగుర్పాటు. ``ఐస్‌క్రీమ్ పార్లర్‌లను చూశాడు. బ్యూటీ పార్లర్‌లను చూశాడు మరి ఇవేమిటి? ఈ దేశంలో ఇలాంటివీ ఉంటాయా'' అనుకున్నాడు. కొడుకుని అడుగుదామనుకున్నాడుగానీ ఎందుకో మనసొప్పలేదు.

గంట ప్రయాణం తర్వాత కొడుకు ఉంటున్న కాలనీకి చేరుకున్నాడు. రెండువందలకుపైగా ఇళ్ళున్న ఆ కాలనీలో కొడుకుది టూ బెడ్‌రూమ్ ఉన్న ఇల్లు. ముందు చిన్నగార్డెన్. చుట్టూ ఫెన్సింగ్ కారు పార్కింగ్‌కు గ్యారేజ్. దంపతులిద్దరికీ బడలికగా అనిపించింది. పన్నెండు గంటల విమాన ప్రయాణంలో వచ్చిన జెట్‌లాగ్ వల్ల భోజనం కానిచ్చి వెంటనే నిద్రపోయారు.

కొడుకు ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఆ రోజు రామానుజానికి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్ల వారుతుందా ఎంత తొందరగా కొడుకుకు జరిగే సన్మానం చూద్దామా అనే ఆలోచనలలోనే నిద్రపోయాడు.

ఉదయం లేచిన వెంటనే కొడుకు తయారవమని తొందరపెట్టాడు. దంపతులిద్దరూ గబగబా తయారయ్యారు. రామానుజం తన బ్యాగ్‌లోంచి

బట్టలు తీసుకుని వేసుకోబోతుంటే కొడుకు హ్యాంగర్‌కు తగిలించిన ఒక కోటు అందించాడు. రామానుజానికి ఆశ్చర్యం, ఆనందం. "ఈ పంచెకట్టు తెలుగుపంతులికి ఎందుకురా ఈ సూటు, బూటు" అన్నాడు.

"భలేవాడివి నాన్నా, నేను సూటులో ఉంటాను. నిన్నూ అలా సూటులో చూసుకోవాలని నా ఆశ!" అన్నాడు శంకరం. రామానుజానికి కళ్ళంట నీళ్ళొచ్చాయి. కొడుకు చేతులను ఆప్యాయంగా స్పృశించాడు.

తండ్రీ కొడుకులిద్దరూ సూట్లు ధరించేసరికి రామానుజం భార్య ఆనంద పడింది. శంకరం తనకు కొన్న పట్టుచీర కట్టుకుని తయారయ్యింది. అంతా బయలుదేరారు. రామానుజానికి చాలా ఉద్వేగంగా ఉంది.

అరగంట ప్రయాణం తర్వాత కారు, పెద్ద గేటున్న ఆవరణలోనికి పోనిచ్చాడు శంకరం. గేటు ముందున్న బోర్డు చూసి గతుక్కుమన్నాడు రామానుజం.

నిన్న ఎయిర్ పోర్టు నుంచి వస్తుంటే కనిపించిన బోర్డు ఇలాంటిదే! "ఫ్యునరల్ పార్లర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్" శరీరంలో నరనరాలు ఒక్కసారి కృంగినట్టనిపించాయి రామానునజానికి.

కొడుకు పనిచేసేది ఫ్యునరల్ సర్వీసులోనా అంటే అంతిమ సంస్కారం! తను ఏదైతే వద్దనుకున్నాడో అదే జరుగుతోందా? తాతబాటలో మనవడు... ఇన్నివేల మైళ్ళ దూరం ప్రయాణంచేసి, ఇంత దూరం వచ్చి, ఈ ఆఫ్రికా దేశంలో కొడుకు చేసే పని ఇదా!...

రామానుజంలో దుఃఖం. మనసులో మూగరోదన. భార్యకు ఏమీ అర్థంకాలేదు. కారు ముందుకు వెళుతోంది. కారు దిగిన కొడుకుకు, జెండా లతో స్వాగతం పలికారు ఆఫ్రికా చిన్నారులు.

"ఇదే మా కేంద్ర కార్యాలయం, ఆఫ్రికా అంతా శాఖ లున్నాయి" అన్నాడు కొడుకు.

లోపల విశాలమైన గదిలో అందంగా నగిషీలు చెక్కిన పేటికలు, ఒకవైపు పువ్వుల రాశులు. మరోవైపు రంగు రంగుల కొవ్వొత్తులు. విషయం అర్థమైపోయింది రామానుజానికి. భార్యకు చెప్పేశాడు ఉండబట్టలేక. హుషారుగా వున్న ఆమె ముఖం వెలవెలబోయింది.

కొడుకు ఎవరెవరికో పరిచయం చేస్తున్నాడు.

"1893లో మా దక్షిణాఫ్రికాలో మాకోసం ప్రజాహక్కుల ఉద్యమాన్ని నడిపిన మహాత్ముడు పుట్టిన దేశం నుంచి వచ్చిన మీకు స్వాగతం" అంటూ రెండు చేతులు జోడించాడు ఒక వ్యక్తి. ఒకవైపు సంతోషం, మరోవైపు దుఃఖం, పెదాలు నవ్వుతున్నా కళ్ళుమాత్రం నీటిపొరతో నిండి పోయాయి రామానుజానికి.

భార్య ఏదో సమాధానపడినా రామానుజం మనసు మనసులో లేదు. తల్లిదండ్రుల్లో హఠాత్తుగా మొదలైన మానసిక సంఘర్షణ గురించి శంకరానికి అర్థం కాలేదు. కొడుకు ఇద్దరినీ ఒక విశాలమైన ఆడిటోరియంలోకి తీసుకుని వెళ్ళి కూర్చోబెట్టాడు.

పావుగంట తర్వాత మీటింగ్ మొదలయ్యింది. "మిస్టర్ శంకరం, మేనేజర్, ఆపరేషన్స్, ఫ్యునరల్ పార్లర్, జోహెన్స్ బర్గ్ వారికి మా హృదయ పూర్వక ఆహ్వానం!" అంటూ కొడుకును స్టేజీమీదకు పిలిచారు.

బలంగా, ఎత్తుగా ఉన్న ఒక ఆఫ్రికన్, శంకరాన్ని సాదరంగా చెయ్యి పట్టుకుని స్టేజీమీదకు తీసుకువెళ్ళాడు.

సంగీతం వినిపిస్తున్న వాయిద్య కారులు గౌరవసూచకంగా ట్రంపెట్లు మ్రోగించారు. శంకరాన్ని వేదికమీద వున్న కంపెనీ ఉన్నతాధికారుల మధ్య కూర్చోబెట్టారు. శంకరం పక్క కూర్చున్న వ్యక్తి ఒక శ్వేతజాతీయుడు.

ఆయన వెంటనే నుంచుని మైకులో ఉపన్యాసం మొదలెట్టేడు.

“అందరికీ నమస్కారం. ఇక్కడకు మా కంపెనీ ఉద్యోగులేకాకుండా కొంత మంది స్నేహితులు, అతిథులు విచ్చేశారు. అందరికీ కృతజ్ఞతలు. మా పరిసర దేశాలైన సూడాన్, కెన్యా, కాంగో, ఉగాండాలలో ముందుగా ఫ్యునరల్ పార్లర్ సర్వీసులు మొదలయ్యాయి.

బహుశా ప్రపంచంలోని ఏ ఇతరదేశాలలోనూ ఈ రకమైన సంస్థ ఉంటుందని నేననుకోను.

ఈ ఆఫ్రికాదేశంలోనే ఈ రకమైన ఫ్యునరల్ పార్లర్‌లను ఏర్పాటు చెయ్యడానికి ముఖ్యకారణం, ఇక్కడ అరవై ఏళ్ళు వయస్సు దాటినవారు ఆరు శాతం మంది మాత్రమే ఉన్నారు కనుక, మీరు అర్థం చేసుకోవచ్చు మరణాల శాతం ఎంత అధికంగా ఉందో.

మొదట ప్రజల అవసరంగా ఏర్పడిన ఈ ఫ్యునరల్ పార్లరు. పల్లె టూళ్ళు, వలస ప్రాంతాలలో సేవలు అందించేందుకు కార్పొరేట్ స్థాయిలో మా సంస్థ విస్తరించింది. అయితే వాణిజ్యపరంగా ఏర్పాటైన ఈ సంస్థకు మానవత్వపు పరిమళం అద్దినవారు మిస్టర్ శంకర్.” అనగానే సభ అంతా కరతాళధ్వనులతో నిండిపోయింది. రామానుజం మనసూ ఆనందపర వశమైనా, ఎక్కడో, ఏదో బాధ!

ఆ శ్వేతజాతి అధికారి చెప్పడం పూర్తిచేసి “ఇంకా వివరంగా మా కంపెనీ జనరల్ మేనేజర్ మిస్టర్ మార్కోస్ మాట్లాడతాడు” అని చెప్పి కూర్చున్నాడు.

మార్కోస్ చెప్పడం ప్రారంభించాడు. “అందరికీ నమస్కారం... గాంధీ పుట్టిన గడ్డమీద పుట్టిన ఈ శంకర్ ఆయనలాగే కరుణ, ప్రేమ మూర్తీభవించిన మనిషి. మన ఆఫ్రికాలో ఎయిడ్స్ మహమ్మారి విజృంభించి ఎంతోమంది జీవితాలను నాశనం చేసింది.

అలా ఎయిడ్స్‌బారిన పడినవారిని మన సమాజమే కాదు వారి కుటుంబమూ వెలివేసింది. వారిని ఏ రోడ్డు మీద వదిలెయ్యడమో, కార్పొరేషన్ వాహనాలలో చెత్తతో పాటు తోసెయ్యడమో చేస్తున్నారు.

అయితే శంకర్ మా సంస్థలో ప్రవేశించిన వెంటనే అనాథ ప్రేతల్లా వదిలేయబడ్డవారికి అంతిమ సంస్కారాన్ని స్వయంగా నిర్వహిస్తున్నారు. మా సహచర ఆఫ్రికన్ ఉద్యోగులే తోటి నల్లజాతివ్యక్తి ఎయిడ్స్‌తో చనిపోతే ఏ డ్రెయినేజీలోనో ఆ శవాన్నితోసే పరిస్థితినుంచి ఈ శంకర్ కాపాడారు. మిగతా వారికి స్ఫూర్తిగా నిలిచారు. ఈయన మనకు ఆరాధ్యదైవం. అందుకే ఈ సన్మానం'' అంటూ శంకర్‌ని హత్తుకున్నాడు.

ఆ వేదిక మీద ఉన్నవారంతా ఒక్కొక్కరే భారతీయ సాంప్రదాయం ప్రకారం శాలువా కప్పారు. రామానుజానికి ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా అనిపించింది. భార్య పరిస్థితీ అదే. ఇంతలో కొడుకును మాట్లాడమన్నారు.

శంకరం గొంతు విప్పాడు. ``మీరు చేసిన సన్మానానికి కృతజ్ఞతలు. మా తాతయ్య తరచూ నాకు ఒకమాట చెప్పేవారు. మనం పుట్టినప్పుడు అంతా సంతోషిస్తారు. అంతా స్వాగతం పలుకుతారు. అలాగే పోయేటప్పుడు మన వీడ్కోలు అంత ఘనంగా జరగాలి అనేవాడు.

చావు అనేది మానవజీవితానికి భగవంతుడు ఇచ్చిన అద్భుతమైన ముగింపుగా ఆధ్యాత్మికులు ప్రవచించారు. అయితే అంతిమయాత్ర గురించి ఆలోచించడానికే అందరూ భయపడతారు.

జీవితంలో ప్రతిపనికీ ప్రణాళిక వేస్తారు దీనికి తప్ప. చావుని ఎవ్వరూ ఎదుర్కోలేరు. అయితే మనం ఈ ప్రపంచంనుంచి వీడ్కోలు తీసుకునే టప్పుడు ఆ యాత్ర ఎలా వుండాలో ఒక్కసారైనా ఊహించగలిగినా, ఆలోచించినా, ఎవరికీ చావు భయం పుట్టదు.

సృష్టిలోని ప్రతిజీవికీ చావుభయం వెంటాడుతూనే ఉంటుంది. అయితే మరణభయాన్ని జయించిన వ్యక్తిని ఏ భయమూ ఏమీ చెయ్యలేదు. అలా

అర్థరహిత మృత్యుభయాన్ని జయించాలంటే మన అంతిమయాత్రను గురించి ఆలోచించాలి. ఆ యాత్రను గురించి గొప్పగా ఊహించుకోవాలి. అలా ఆశావహదృక్పథంలో మన జీవితం ముగిసేవరకు ప్రశాంతంగా జీవిస్తాం.''

శంకరం చెప్పడం ఆపగానే అందరూ లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. రామానుజం, అతడి భార్య, ఇద్దరి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అంతవరకూ వారినే చూస్తున్న ఒక యాభయ్యేళ్ళ వ్యక్తి వారివంక తిరిగి ''అయ్యా మీకు ఈ శంకరం ఏమవుతారు?'' అన్నాడు.

''ఆ అబ్బాయి నా కొడుకు'' అన్నాడు రామానుజం. అతను వెంటనే ''నేను ఈ జోహెన్స్ బర్గ్‌లో ఇరవయ్యేళ్ళుగా ఉంటున్నాను. నా పేరు విష్ణుమూర్తి. ఇక్కడి యూనివర్సిటీలో వేదాంతశాస్త్రంలో ప్రొఫెసర్‌ని. ఫిలాసఫీలో రెండు పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలున్నాయి. రెండు యూనివర్సిటీలలో పిహెచ్‌డీలు చేశాను. చాలామంది విద్యార్థులను గైడ్ చేస్తున్నాను. అయినా రోజూ పడుకోబోయే ముందు ఏవో గుబులు, మా అనంతపురంలోని నా బంధువులు గుర్తుకొస్తారు. ఎప్పుడు ఏమవుతానో అనే భయం. మీ కొడుకు చెప్పినట్లు అర్థరహిత మృత్యుభయం, అయితే ఈ క్షణం అది పోయింది. మీ కొడుకు మాటలతో ఒక జీవితసత్యం తెలిసింది. ఆ మాటలు నాలో బీజాక్షరాలుగా నాటుకున్నాయి. ఇక నాకు ఏ భయమూ లేదు. తుదివరకూ ఆనందంగా గడుపుతాను.''

అతని మాటలు పూర్తికాకమునుపే వారి పక్కనే కూర్చున్న ఒక నల్లజాతి యువకుడు నిలబడి రెండు చేతులు జోడించి. ''అయ్యా! నేను పుట్టిన మరుక్షణమే నా తల్లి చనిపోయింది. మానాన్న నన్ను పెంచాడు. నాకు ఊహ తెలిసినప్పటినుంచీ అన్నీ నాన్నే.

అలాంటి నాన్నకు ఎయిడ్స్ వచ్చిందని దూరంగా ఉంచాను. చెట్టంత కొడుకు ఉన్నా అనాథలా ఆయనను అమెరికా మిషనరీలు నడిపే ఐసోలేషన్ క్యాంపులో ఉంచాను. ఆయన ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడు. మీ కొడుకు చేస్తున్న పనిగురించి నాకు తెలిసింది. జ్ఞానోదయం అయింది. వెంటనే

నా తండ్రిని నా ఇంటికి తెచ్చుకుంటాను. ఆయన చనిపోయేవరకు సేవలు చేస్తాను" అంటూ కన్నీరు కారుస్తూ ఆ నల్లజాతి యువకుడు అక్కడినుంచి నిష్క్రమించాడు.

వెంటనే రామానుజం. భార్యతో "చూశావా, మన కొడుకు ఎంత మందికి స్ఫూర్తి కలిగించాడో, చదువు, సంధ్యలు లేవని తిట్టేవాళ్ళం. పాపం ఎమ్.బి.ఎ. చదువు తాను నాన్నా అన్నా. మనం సహకరించలేదు. అయినా ఎంత ఎత్తుకు ఎదిగాడో!" అన్నాడు బాధగా.

ఆ మాటలకు అంతక్రితం వారితో మాటలాడిన విష్ణుమూర్తి "చూడండి, నేను ఇందాకే మీకు మనవి చేసుకున్నాను, నేనెంత చదివానో! నన్నందరూ విద్వాన్ విష్ణుమూర్తి అంటారు. వేదాంతంలో పండిపోయాను. అయినా నాకు జ్ఞానం కలగలేదు. మనిషికి ఎంత విద్య వున్నా విద్వత్తు లేకపోతే రాణించలేడు. అయితే కేవలం డిగ్రీతో చదువు ఆపేసిన మీ కొడుకు ఏ వేదాంతశాస్త్రమూ ఉపదేశించలేని ఒక జీవిత సత్యాన్ని నాకు తెలియ జెప్పేడు. మీ అబ్బాయి బతుకు పుస్తకాన్ని ఔపోసన పట్టాడు. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఇప్పుడు విద్వాంసుడెవరు? అతడా నేనా? అందుకే అతడి కాళ్ళకు నమస్కరిద్దామనుకున్నాను, అయితే చిన్న వాడు కాబట్టి దీవిస్తున్నాను. అతడిని కన్న తల్లిదండ్రులైన మీకు పాదాభివందనం" అంటూ రామానుజం దంపతు లకు అతను నమస్కరించాడు.

రామానుజం ఇక ఆగలేకపోయాడు. తన కన్నీటిని ఆపలేకపోయాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళి వేదికమీదున్న కొడుకును హత్తుకున్నాడు.

ఆ సమయంలో అతడికి అపరకర్మలు నిర్వహించి అందరిచేతా కీర్తించ బడ్డ తండ్రి గుర్తుకొచ్చాడు.

(స్వాతి వీక్లి 9-3-2012లో ప్రచురణ సూక్తి కథల పోటీలో బహుమతి)